క్లుప్తంగా

కొనకనమిట్ల ఏఓకు సన్మానం



ఏఓ ప్రకాష్‌రావుకు సన్మానిస్తున్న దుకాణదారులు

కొనకనమిట్ల: మండల నూతన ఏఓగా బాధ్యతలు చేపట్టిన కె.ప్రకాష్‌రావును మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాల డీలర్లు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఎరువులు, మందులు, విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని సూచించారు. అనంతరం బదిలీపై మార్కాపురం ఏడీ కార్యాలయానికి వెళ్తున్న ఏఓ ప్రసన్న రంగలక్ష్మిని దుకాణదారులు, రైతు సేవా కేంద్రం ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు గుత్తా శ్రీనివాసులు, బోనం వెంకటరెడ్డి, రమణారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పశువైద్యాధికారులు



కొనకనమిట్లలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, పెదారికట్ల పశువైద్యాధికారులుగా కాసు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాంత్‌రెడ్డి పెదారికట్ల పశువైద్యాధికారిగా పని చేస్తూ కొనకనమిట్ల పశు వైద్యశాలకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు కొనకనమిట్లలో పని చేసిన అమూల్య ఒంగోలు డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. అలాగే కాకర్లలో పనిచేస్తున్న కృష్ణమోహన్ పెదారికట్ల పశువైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు మాట్లాడుతూ.. పశుపోషకులకు మెరుగైన సేవలు అందజేస్తామని పేర్కొన్నారు. వైద్యులకు ఆయా పశువైద్యశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రోత్సాహక బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ప్రజాపిత బ్రహ్మకుమారి ప్రతినిధి సావిత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బ్రహ్మకుమారి యోగా మందిరం ఆవరణలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా అభ్యాసకులు కృష్ణ, యువప్రగతి సంస్థ నిర్వాహకులు ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు దర్శిలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య కోరారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా సభలకు కార్మికులంతా హాజరై ముఖ్యఅతిథులు చెప్పే సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాశీం, నాయకులు కాశయ్య, వీరయ్య, హరిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

కంభం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ వీరభద్రాచారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ మాల్యాద్రి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సత్తార్, మోయిన్, గని వెంకటేశ్వర్లు, సీఆర్పీలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి చీడకు ఏసీబీ దడ!

- ముఖ్య శాఖల్లో ఎంతోకొంత ముట్టజెప్పనిదే ముందుకు కదలని ఫైళ్లు
- ఇటీవల ఏసీబీ అధికారుల దాడితో బెంబేలు
- ఎక్కడ దొరికిపోతామోనని లంచావతారుల్లో వణుకు



ఏసీబీ అధికారులు ఇటీవల దాడి చేసిన మార్కాపురం ఇరిగేషన్ కార్యాలయం

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో కీలక ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఏసీబీ భయం పట్టుకుంది. మార్కాపురం పట్టణంలో గత సోమవారం ఇరిగేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం తెలిసిందే. ఈ సమాచారం క్షణాల్లో మార్కాపురం పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి తెలియడంతో ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. పలువురు ప్రభుత్వ సిబ్బంది హడావుడిగా తమ ఆఫీసులను వదిలి బయటకు వెళ్లారు. ఏసీబీ అధికారుల దాడితో అవినీతికి పాల్పడుతన్న వారిలో భయం పట్టుకుంది. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో రెవిన్యూ, పంచాయితీరాజ్, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్, రవాణా శాఖ, ట్రెజరీ, ఎంపీడీఓ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, వైద్యారోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారుల కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న కొంత మంది సిబ్బంది చేతులు తడపనిదే పనులు కావడం లేదన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

పెచ్చుమీరుతున్న అవినీతి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు పెండింగ్‌లో పెట్టడం.. ఆపై కాంట్రాక్టర్లు, దరఖాస్తుదారులతో ఒప్పందాలు చేసుకుని అందినకాడికి డబ్బు దండుకున్న సంఘటనలు పశ్చిమ ప్రకాశంలో తరచూ చోటుచేసుకుంటున్నాయి. న్యాయబద్ధంగా పరిష్కరించాల్సిన సమస్యలను సైతం కొర్రీలు పెట్టి నెలల తరబడి తిప్పుకొంటున్న తీరుపై విమర్శలొస్తున్నా సదరు అధికారులు, సిబ్బందిలో మార్పు కానరావడం లేదు. 2023 జూలై 19న కొనకనమిట్ల ఎస్సై, అదే ఏడాది మే మొదటి వారంలో కంభం సబ్ రిజిస్ట్రార్, తర్లుపాడు ఏఎస్సైలు ఏసీబీ వలలో చిక్కుకున్నారు. యర్రగొండపాలెంలో ఒక రైతు పొలం మ్యుటేషన్ చేసేందుకు లంచం తీసుకుంటూ గత ఏడాది జనవరి 10న ఇద్దరు వీఆర్ఓలు ఏసీబీ అధికారులకు చిక్కారు. గత ఏడాది జనవరి 4న అప్పటి దర్శి ఎస్సై ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

> **లంచం అడిగితే ఫోన్ చేయండి**
> ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఎవరైనా సరే సమస్యలు పరిష్కరించే పేరుతో లంచం అడిగితే, ఆ సమాచారాన్ని ఏసీబీకి చేరవేయండి. ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.
> – శిరీష, ఏసీబీ డీఎస్పీ

రమేష్ మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు





నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు, అన్నా, ఉడుముల

పొదిలి: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం కంకణాల రమేష్ అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు రమేష్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. రమేష్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా పార్టీ కోసం పనిచేశారని, సేవా కార్యక్రమాల్లో ముందుండారని కొనియాడారు. రమేష్ ఆశయాలను నెరవేర్చే క్రమంలో వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉడుముల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. రమేష్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ ఉద్దేశించిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేయటంలో రమేష్ పాత్ర కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, పొదిలి పట్టణంలోని వ్యాపారులు దుకాణాలు మూసివేసి సంతాపం తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మోరబోయిన మురళి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బేతా ప్రకాశ్‌రెడ్డి, వాకా సుబ్బారెడ్డి, ఆనికాళ్ల ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, మాజీ వార్డు సభ్యులు బాషా, ఎద్దు నగేష్, ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గునుపూడి భాస్కర్, శ్రీకృష్ణ దేవరాయ సాంస్కృతిక సంస్థ చైర్మన్ శ్రావణి వెంకటేశ్వర్లు, మానవత సంస్థ కన్వీనర్ మువ్వల పార్థసారథి, సామి రాజా, పైడిమర్రి శ్రీనివాసులు, మేడా నరసింహారావు, బండి అశోక్, కొనకనమిట్ల మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు కన్నీటి వీడ్కోలు పలకగా, హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన డాక్టర్ పద్మావతి

మార్కాపురం టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, వాటి నిరోధానికి వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు ఎవరైనా చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ కె.పద్మావతి మాట్లాడుతూ.. మార్కాపురం డివిజన్ పరిధిలో 44 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు, 5 ప్రభుత్వానికి సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేయవద్దని స్పష్టం చేశారు. డివిజన్‌లో వెయ్యి మంది మగపిల్లలకుగాను 981 మంది ఆడపిల్లలు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రామాంజనేయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మదర్సెస్ ఇండియా సెక్రటరీ జీవీ ప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్ శ్రవణ్‌తేజ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని రైల్వే ట్రాక్‌మన్‌కు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్య

మార్కాపురం టౌన్: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో రైల్వే ట్రాక్‌మన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బోడపాడు రోడ్డులోని ప్రైవేటు పాఠశాల సమీపంలోని బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అర్ధవీడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన నల్లబోతుల లక్ష్మయ్య రైల్వే ట్రాక్‌మన్‌గా పనిచేస్తున్నారు. బుధవారం కురిచేడులో విధులు ముగించుకుని బైక్‌పై బోడపాడు మీదుగా మార్కాపురం వస్తున్నారు. ఈ క్రమంలో మార్కాపురం నుంచి బోడపాడు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లక్ష్మయ్యను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను 108 అంబులెన్స్‌లో మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. స్థానిక వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై రాజమోహన్‌రావు తెలిపారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ సిబ్బంది

మార్కాపురం టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతోపాటు ఇతరుల ప్రాణాలను రక్షించిన వారవుతారని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో బ్యాంకు ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొని రక్తదానం చేశారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడినవారవుతారని తెలిపారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బజారు బ్రాంచ్ 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కాగా శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ హరి, విద్యాసాగర్, శంకర్, యూనియన్ నాయకులు రమణారెడ్డి, కాశిరెడ్డి, లక్ష్మణరావు, గౌస్‌బాషా, ఖాతాదారులు పాల్గొన్నారు.

గొట్లగట్టులో ట్రాఫిక్ సమస్య



బస్టాండ్ సెంటర్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్

కొనకనమిట్ల: మండలంలోని మేజర్ పంచాయతీ గొట్లగట్టులో ఒంగోలు–గిద్దలూరు రహదారిలో బస్టాండ్ సెంటర్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్టాండ్ సెంటర్‌తోపాటు గ్రామంలోకి వచ్చే రహదారిలో ఆటోలు, మోటార్ సైకిళ్ల పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో వాహనారాకపోకలకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. మెయిన్ రోడ్డుపై కొందరు దుకాణదారులు మార్జిన్ దాటి బయటి రావడంతోపాటు ఆ పక్కనే ఆటోలు, బైకులు నిలుపుతున్నారు. దీంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదు. అంతే కాకుండా బస్‌షెల్టర్ ముందు కూడా ఆటోలు నిలపడంతో ప్రయాణికులు నిల్చోవడానికి కూడా వీలుపడటం లేదు. బస్ షెల్టర్‌కు ఎదురుగా తోపుడు బండ్లు అడ్డుగా పెట్టడం, లోపల మందుబాబులు మద్యం తాగి అక్కడే గ్లాసులు, ఖాళీ సీసాలు, తినుబండారాల వ్యర్థాలు పడేస్తుండటంతో అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతోపాటు బస్ షెల్టర్‌ను శుభ్రం చేయించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

రహదారిని కమ్మేసిన చిల్లచెట్లు

మార్కాపురం: మార్కాపురం మండలంలోని పలు రహదారులు చిల్లకంపతో మూసుకుపోయి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. చింతగుంట్ల నుంచి ఎల్‌బీఎస్ నగర్ వెళ్లే రహదారికి ఇరువైపులా సుమారు రెండు కిలోమీటర్ల మేర చిల్లకంప దట్టంగా పెరిగింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



చింతగుంట్ల - ఎల్‌బీఎస్ నగర్ మార్గంలో ఇదీ పరిస్థితి

చెవిరెడ్డి అరెస్టు రెడ్‌బుక్ కుట్ర

మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని రెడ్ బుక్ కుట్రలో భాగంగానే అన్యాయంగా అరెస్టు చేశారని, అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ గిద్దలూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లిక్కర్ కేసు విచారణలో ఉండగానే సిట్ అధికారులు నిజనిజాలు తెలుసుకోకుండా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. ఆయనపై నమోదు చేసిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడటం మానుకుంటే మంచిదని హితవు పలికారు.

లేని స్కామ్‌లో ఇరికించడం అన్యాయం

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో జరగని స్కామ్‌లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడం అన్యాయమని ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ తీరును రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. లిక్కర్ కేసులో ఏ మాత్రం సంబంధం లేని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం అక్రమంగా ఇరికించడం దారుణన్నారు. ప్రజల తరుపున ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి విధానాలను, తప్పుడు కేసులు పెట్టడాన్ని మానుకోవాలని హితవు పలికారు. చెవిరెడ్డిపై అక్రమ కేసును ఎత్తివేసి, విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రెడ్ బుక్ రాజ్యాంగం అమలు తారస్థాయికి..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి



మాట్లాడుతున్న కేవీ, వైవీ

పొదిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే వారిని అరెస్ట్ చేస్తామనే విధంగా వ్యవహారం ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పొదిలిలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. లేని మద్యం కుంభకోణాన్ని బూచిగా చూపించి, అసలు ఆ కేసుతో సంబంధం లేని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంతో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తారాస్థాయికి చేరిందని ధ్వజమెత్తారు. మరో వైపు ప్రజా సంక్షేమ, అభివృద్ధి ఊసే లేదన్నారు. అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో కూటమి సర్కారు కుట్రలకు తెరలేపిందన్నారు. చెవిరెడ్డితో ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, మరో నలుగురిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని చెప్పారు.

అధికారులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీడీఓ బాలూనాయక్

తర్లుపాడు: పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డీడీఓ బాలూనాయక్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డుల ఈకేవైసీ, తల్లికి వందనం పథకం అమలులో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ బి.చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ సుకుమార్, సీనియర్ అసిస్టెంట్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



గిద్దలూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒప్పంద కార్మికులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పి.మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ ఒప్పంద కార్మికులకు, చిరుద్యోగులకు ఆదాయంతో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం సరికాదన్నారు. మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న కార్మికులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఇంజనీరింగ్ విభాగం నాయకులు పుల్లయ్య, రంగస్వామి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.